# అభివృద్ధిలో కల్పవల్లి.. కూకట్‌పల్లి

## పదేండ్లలో వేలాది కోట్లతో అభివృద్ధి

- ట్రాఫిక్ సమస్యలకు విముక్తి
- అంతరాయంలేని విద్యుత్.. సమృద్ధిగా తాగునీరు
- ఖాళీ స్థలాలు పార్కులుగా, క్రీడా ప్రాంగణాలుగా అభివృద్ధి
- పేదలందరికీ సంక్షేమ ఫలాలు
- నేడు ప్రగతి నివేదన సభ.. పాల్గొననున్న మంత్రి కేటీఆర్



కేపీహెచ్‌బీ కాలనీ నుంచి హైటెక్ సిటీకి వెళ్లేందుకు అండర్‌పాస్ బ్రిడ్జి (ఫైల్)

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 4: కూకట్‌పల్లి నియోజకవర్గంలో గడిచిన పదేండ్ల కాలంలో కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధిని సాధించింది. విభిన్న దేశాలు, రాష్ర్టాల ప్రజలకు నిలయమైన కూకట్‌పల్లి అనతికాలంలో శరవేగంగా వృద్ధిని సాధించగా.. పెరిగిన జనాభాకనుగుణంగా కనీస మౌలిక వసతులు కల్పించడంలో గత పాలకులు విఫలమయ్యారు. సీఎం కేసీఆర్ పాలనలో మంత్రి కేటీఆర్ మార్గదర్శకంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పట్టుదల, నిర్విరామ కృషి ఫలితంగా నేడు నగరంలో ఏ ఎక్కడాలేని విధంగా కూకట్‌పల్లి అభివృద్ధిని సాధించింది. ప్రజలకు మౌలిక వసతుల కల్పన, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం, మెరుగైన రోడ్ల వ్యవస్థ, నిరంతరంగా విద్యుత్ సరఫరా, సమృద్ధిగా తాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థల ఆధునీకరణ, నాలాల అభివృద్ధి, చెరువుల సుందరీకరణ, పార్కులు, క్రీడా ప్రాంగణాల అభివృద్ధి, మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్లు, బస్తీ దవాఖానల ఏర్పాటుతో అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించింది.

### ట్రాఫిక్ సమస్యలకు విముక్తి..

హైటెక్‌సిటీ సమాంతరంగా ఉన్న కూకట్‌పల్లి పరిసర ప్రాంతాలన్నీ ట్రాఫిక్ సమస్యలకు కేంద్రంగా ఉండేది. కేపీహెచ్‌బీ కాలనీ హైటెక్‌సిటీ మార్గంలోని రాజీవ్‌గాంధీ (ఫోరం సుజాన మాల్) చౌరస్తాలో రూ.84 కోట్లతో ఫ్లై ఓవర్ బ్రిడ్జి, కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్ సమీపంలో రూ.64 కోట్లతో రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి, కైత్లాపూర్, మాదాపూర్ మార్గంలో రూ.135 కోట్లతో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి, బాలానగర్ నర్సాపూర్ చౌరస్తా నుంచి సనత్‌నగర్ మార్గంలో రూ.40 కోట్లతో ఫ్లై ఓవర్ బ్రిడ్జి, ఫతేనగర్, బేగంపేట రోడ్డులో రూ.60 కోట్లతో ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను నిర్మించారు. ఎన్నో ఏండ్లుగా ట్రాఫిక్ కష్టాలకు నిలయమైన బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాలో రూ.390 కోట్లతో నిర్మించి ఫ్లై ఓవర్ బ్రిడ్జి పూర్తి కావడంతో వాహనదారులందరికీ ఎంతోమేలు జరిగింది.

### మెరుగైన మౌలిక వసతులు..

ఇరువై ఏండ్ల కిందట సాదాసీదాగా ఉండే కూకట్‌పల్లిలో వివిధ రాష్ర్టాలు, దేశాలకు చెందిన ప్రజలకు నివాస కేంద్రంగా మారింది. కేపీహెచ్‌బీ కాలనీ, మూసాపేట, బోయిన్‌పల్లి, అల్లాపూర్, ఫతేనగర్, బాలానగర్, కూకట్‌పల్లి ప్రాంతాలలో ప్రజలు నివాసాలు ఏర్పర్చుకోగా దానికనుగుణంగా మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఏర్పడింది. కూకట్‌పల్లి నియోజకవర్గంలో 9 రిజర్వాయర్లతో 45లక్షల గ్యాలర్ల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవడం, రూ.390 కోట్లతో 375 కి.మీ. పైప్‌లైన్ వ్యవస్థను పునరుద్ధరించడం, ప్రతి రోజూ 30 ఎంజీడీల తాగునీటిని సరఫరా చేస్తుండటంతో నేడు తాగునీటి కష్టాలన్నీ మాయమయ్యాయి. 24 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా, ప్రతి కాలనీ, బస్తీల్లో డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించడం, చెరువులు, నాలాలు ఆక్రమణలకు గురికాకా కంచెలు ఏర్పాటు, మురుగునీరు చేరకుండా ఎస్‌టీపీలను ఏర్పాటు చేశారు.

### పార్కులు.. క్రీడా ప్రాంగణాలు..

నియోజకవర్గంలో నిరుపయోగంగా ఉన్న ఖాళీ స్థలాలను పార్కులుగా, క్రీడా ప్రాంగణాలుగా అభివృద్ధి చేశారు. కేపీహెచ్‌బీ కాలనీ మొదటి రోడ్డులో జీహెచ్‌ఎంసీ ప్లే పార్కు, కేపీహెచ్‌బీ కాలనీ 1, 2వ రోడ్డుల్లో పార్కు, కాలనీ 5వ ఫేజ్‌లో ఐదెకరాల స్థలంలో కేటీఆర్ పార్కు తరహాలో పార్కుతో పాటు క్రికెట్ స్టేడియం, వసంతనగర్‌లో బతుకమ్మ పార్కు, కూకట్‌పల్లి, బాలానగర్, బోయిన్‌పల్లి, ఫతేనగర్, అల్లాపూర్‌లలో ప్రత్యేకంగా పార్కులను అందుబాటులోకి తెచ్చారు.

### మోడల్ రైతుబజార్.. ఫిష్ మార్కెట్..

కేపీహెచ్‌బీ కాలనీలో రూ.30 కోట్లతో సకల వసతులతో కూడిన మోడల్ రైతుబజార్‌ను అభివృద్ధి చేశారు. రూ.9 కోట్లతో మోడల్ ఫిష్ మార్కెట్, కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజ్, అల్లాపూర్ పర్వత్‌నగర్‌లో కలిపి రెండుచోట్ల మల్టీపర్పస్ ఫంక్షన్‌హాళ్లను అందుబాటులోకి తెచ్చారు. కేపీహెచ్‌బీ కాలనీ 7వ ఫేజ్‌లోని కైలాసవాసం, క్రిస్టియన్, ముస్లిం శ్మశానవాటిక, బేగంపేటలోని శ్మశానవాటికలను ఆదర్శవంతంగా అభివృద్ధి చేశారు.

### ఎమ్మెల్యే సొంత నిధులతో..

కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు సొంత నిధులతో గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా 250 మంది దివ్యాంగులకు ద్విచక్ర వాహనాల పంపిణీ, ప్రజలకు అందుబాటులో రెండు ఉచిత అంబులెన్స్‌లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులందరికీ స్కూల్ బ్యాగుల తోపాటు నోట్‌బుక్స్, కంపాస్ బాక్సులు, డిక్షనరీతో కూడిన కిట్టును అందించారు.

### నేడు కూకట్‌పల్లిలో ప్రగతి నివేదన సభ

**హాజరుకానున్న మంత్రి కేటీఆర్..**

కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రగతి నివేదన సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. గురువారం సాయంత్రం 4 గంటలకు కేపీహెచ్‌బీ కాలనీ 9వ ఫేజ్‌లో జరిగే ఈ ప్రగతి నివేదన సభకు మంత్రి కేటీఆర్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. బాలాజీనగర్ డివిజన్‌లోని రంగధాముని (ఐడీఎల్) చెరువుగట్టుపై రూ.9 కోట్లతో అభివృద్ధి చేసిన రంగధాముని ఫ్రంట్‌లేక్ పార్కును, చెరువు సుందరీకరణ, సీవరేజ్ డ్రైన్ పైప్ లైన్, ముళ్లకత్వ చెరువు వరకు రూ.12 కోట్లతో చేపట్టనున్న సీవరేజ్ పైప్‌లైన్ పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

### పేదలకు సంక్షేమ ఫలాలు

కూకట్‌పల్లి నియోజకవర్గంలో 72వేల కుటుంబాలు ఆహార భద్రత కార్డులు, 42వేల మందికి ఆసరా పింఛన్లు, 15వేల మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అందింది. ఐదువేల మంది సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయాన్ని పొందారు. 12 బస్తీ దవాఖానల ద్వారా నిత్యం వైద్య సేవలు అందుతున్నాయి.

### ప్రజలకు నిత్యం అందుబాటులో..



కూకట్‌పల్లిలో పుట్టి పెరిగిన నాకు ప్రతి కాలనీ, బస్తీ సమస్యలపై పూర్తిగా అవగాహన ఉన్నది. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే తాగునీరు, కరెంటు, డ్రైనేజీ, ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించడానికి దృష్టి సారించాను. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ల సహకారంతో అభివృద్ధి పనులు చేశాను. మూడు ఫ్లైఓవర్లు, ఒక అండర్‌పాస్ నిర్మాణంతో ట్రాఫిక్ సమస్యలన్నీ పరిష్కరించాను. రిజర్వాయర్ల నిర్మాణం, పైప్‌లైన్ల పునరుద్ధరణతో తాగునీటి కష్టాలు తీరాయి. ఖాళీ స్థలాలను పార్కులుగా, క్రీడా ప్రాంగణాలుగా తీర్చిదిద్దగా.. ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకుంటున్నారు. కేపీహెచ్‌బీ కాలనీలో వేలాది కోట్ల విలువైన హౌసింగ్‌బోర్డుకు చెందిన స్థలాలను పార్కుల కోసం, క్రీడా ప్రాంగణాల నిర్మాణం కోసం కేటాయించేలా కృషి చేశాను. పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించడం, ప్రజల కష్టాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా పని చేస్తున్నా. ప్రజల కష్టాలను నేరుగా నాకు చెప్పుకునే అవకాశం కల్పించాను. సీఎం కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధి కండ్లముందే కనబడుతుంది. కాబట్టి రాబోయే ఎన్నికల్లో సైతం భారీ మెజార్టీతో విజయం సాధిస్తానన్న నమ్మకముంది.

**- మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్యే, కూకట్‌పల్లి నియోజకవర్గం**

---

## అర్హులందరికి గృహలక్ష్మి, డబుల్ బెడ్‌రూమ్‌లు అందిస్తాం

మంత్రి మల్లారెడ్డి



గృహలక్ష్మి పథకం ప్రొసీడింగ్ పత్రాలు అందుకున్న లబ్ధిదారులతో మంత్రి మల్లారెడ్డి, అధికారులు

మేడ్చల్, అక్టోబర్4(నమస్తే తెలంగాణ): అర్హులందరికి గృహలక్ష్మి, డబుల్ బెడ్‌రూమ్‌లను ప్రభుత్వం అందించేలా చర్యలు తీసుకుంటుందని రాష్ట్రకార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో సుమారు 300 మంది గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు పేదలందరికీ వర్తింపజేసేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గృహలక్ష్మి పథకంలో దరఖాస్తులు చేసుకున్న అర్హులందరికి గృహలక్ష్మి పథకం వర్తింపజేస్తామన్నారు. నిరుపేదలను ధనవంతులుగా చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు. దళిత బంధు, బీసీల, మైనార్టీలకు రూ. లక్ష ఆర్థిక సాయం చేసి ఆర్థికాభివృద్ధి సాధించేలా చేస్తున్నట్లు వెల్లడించారు. వీటితో పాటు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబీమా, రైతుబంధు వంటి పథకాలు ప్రవేశపెట్టిన ప్రభుత్వం చరిత్ర సృష్టించిందన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో 26వేల డబుల్‌బెడ్‌రూమ్‌లు ఉన్నాయని, ఇందులో పది శాతం స్థానికులకు అందేలా ప్రభుత్వం చూస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ను గెలిపించి రాష్ర్టాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామన్నారు.

### ఇంటి పనులు ప్రారంభించాలి

గృహలక్ష్మి పథకం పొందిన లబ్ధిదారులు ఇంటి పనులను ప్రారంభించేవిధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ ఆశయసాధనకు లబ్ధిదారులు ఇంటి పనులు పూర్తి చేసి సొంతింటి కలను నిజం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, రోడ్లు, భవనాలశాఖ ఈఈ శ్రీనివాసమూర్తి, దమ్మాయిగూడ చైర్మన్ ప్రణీత, ప్రజాప్రతినిధులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## తలసానికే మా మద్దతు

వైశ్య సంఘాల తీర్మానం



సమావేశంలో పాల్గొన్న సనత్‌నగర్ నియోజకవర్గం వైశ్య సంఘాల ప్రతినిధులు

బేగంపేట్, అక్టోబర్ 4 : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సనత్‌నగర్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బరిలోకి దిగుతున్న సిట్టింగ్ ఎమ్మెల్యే, డైనమిక్ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గెలుపు ఖాయంతోపాటు ఆయన అత్యంత భారీ మెజార్టీతో గెలుపొందేందుకు వైశ్య సంఘాలు పూర్తి సంపూర్ణ మద్దతును ప్రకటించాయి. బుధవారం సికింద్రాబాద్‌లోని తాజ్‌మహల్ హోటల్‌లో సనత్‌నగర్ నియోజకవర్గం వైశ్య సంఘాల ప్రతినిధులు నార్ల దీపక్ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సుమారు 10 వైశ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో నియోజకవర్గాన్ని అన్నివిధాల అభివృద్ధి చేయడంతోపాటు ఆదర్శవంతంగా తీర్చిదిద్దిన ఘనత ఆయకు దక్కుతుందన్నారు. ఆర్యవైశ్యులంతా ఆయన వెంట ఉన్నారని వారి మద్దతును తెలిపారు. ఈ సమావేశంలో వైశ్య సంఘాల ప్రతినిధులు జగదీశ్, బెజగం శ్రీనివాస్, వెంకటేశ్, శరత్, మాధవరావ్, భాస్కర్, నాగరాజు, చల్లా ప్రకాశ్, తెలుకుంట పూర్ణచందర్‌రావు, రేపల్లె వెంకటేశ్వర్లు, అక్షయ్ రవీందర్ జగన్, మానేపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు అరెస్ట్ బాధాకరం: మంత్రి తలసాని

సిటీబ్యూరో, అక్టోబర్ 4 (నమస్తే తెలంగాణ): మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఖండించారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు అరెస్ట్ చాలా బాధాకరమని మంత్రి పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో మంత్రిగా పనిచేసిన తనకు ఈ ఘటన వ్యక్తిగతంగా తనకెంతో బాధను కలుగజేసిందన్నారు. అధికారం శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు.

## తార్నాకలో ప్రధాని దిష్టిబొమ్మ దహనం



సీఎం కేసీఆర్, అభివృద్ధి ప్రదాత కేటీఆర్‌పై అబద్ధపు ఆరోపణలు చేసిన ప్రధాని మోదీ తక్షణమే క్షమాపణ చెప్పాలని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రధాని వ్యాఖ్యలకు నిరసనగా దిష్టిబొమ్మను తార్నాకలో బీఆర్‌ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డితో కలిసి ఆమె దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, సునీత, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**- ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 4**

## సన్మానం



తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన బక్కి వెంకటయ్యను తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, ఎం.బి.కృష్ణ, దుర్గేశ్ దితరులు పాల్గొన్నారు. **- చిక్కడపల్లి, అక్టోబర్ 4**